నా కోరికను 'హాయ్ నాన్నా' తీర్చింది

' ఆడపిల్ల తండ్రిని కావాలనేది నా కోరిక. కానీ అబ్బాయి పుట్టాడు. వాడితోనే సరిపెట్టుకున్నా. కానీ ఈ సినిమాతో నాకోరిక తీరింది. నాకూ ఓ కూతురు దొరికింది' అన్నారు నాని. ఆయన కథానాయకుడిగా మృణాల్ ఠాకూర్, బేబీ కియారా ఖన్నా ముఖ్యపాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'హాయ్ నాన్న'. శౌర్యువ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. మోహన్ చెరుకూరి, విజయేందర్‌రెడ్డి తీగల నిర్మాతలు. ఈ చిత్రం టీజర్‌ను ఆదివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడారు. ' నా మనసుకు చాలా దగ్గరైన కథ ఇది. భావోద్వేగపూరితమైన కథ, కథనాలతో సాగే ఈ సినిమా అందరికీ నచ్చుతుందని నా నమ్మకం. నా కూతురుగా నటించిన బేబీ కియారా పాత్ర హైలైట్‌గా నిలుస్తుంది. శౌర్యువ్ ఖచ్చితంగా పెద్ద దర్శకుడవుతాడు' అని నాని అన్నారు. మంచి సినిమా చేశామనే సంతృప్తితో ఉన్నామనీ, డిసెంబర్ 7న సినిమాను పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయనున్నామని నిర్మాతలు చెప్పారు. ఇంకా దర్శకుడు శౌర్యువ్, సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్, బేబీ కియారా కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్, నిర్మాణం: వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్.

'శంకర్ దాదా ఎంబీబీఎస్' రీరిలీజ్

చిరంజీవి కథానాయకుడిగా నటించిన 'శంకర్ దాదా ఎంబీబీఎస్' చిత్రం అప్పట్లో భారీ విజయాన్ని సాధించింది. 2004లో వచ్చిన ఈ చిత్రం పలు రికార్డులను బ్రేక్ చేసింది. చక్కటి సందేశంతో ప్రేక్షకులకు ఆకట్టుకుంది. దేవిశ్రీప్రసాద్ స్వరపరచిన పాటలు చాలా పాపులర్ అయ్యాయి. తాజాగా ఈ చిత్రాన్ని నవంబర్ 4న రీరిలీజ్ చేస్తున్నారు. మెగా ప్రొడక్షన్స్ సంస్థ ద్వారా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. అప్పటి వింటేజ్ చిరంజీవిని చూసేందుకు అభిమానులు సిద్ధంగా ఉండాలని మెగా ప్రొడక్షన్స్ సంస్థ కోరింది. 'శంకర్ దాదా ఎంబీబీఎస్' రీరిలీజ్ పట్ల మెగాభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. నాటి మ్యాజిక్‌ను మళ్లీ తెరపై ఆస్వాదించవొచ్చని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



హరీశ్ పెద్ది, సాహు గారపాటి, అనిల్ రావిపూడి, బాలకృష్ణ, శ్రీలీల, తమన్

స్త్రీశక్తిని చాటే కథ ఇది

'నవరాత్రులు జరుపుకుంటున్న శుభతరుణంలో నా 108వ చిత్రం 'భగవంత్ కేసరి' విడుదలవుతుండటం ఆనందంగా ఉంది. దుర్గ అంటే స్త్రీ శక్తి. ఈ సినిమా కథ కూడా స్త్రీశక్తికి సంబంధించినదే. దుర్గమ్మ వాహనం పులి. ఇందులో అమ్మాయిని పులిలా పెంచాలనే మాట రాశారు దర్శకుడు అనిల్‌రావిపూడి. ఆ తల్లి ఆశీస్సులతో ఈ సినిమా పెద్ద విజయం సాధిస్తుందని నా నమ్మకం' అన్నారు నందమూరి బాలకృష్ణ. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'భగవంత్‌కేసరి', శ్రీలీల, కాజల్, అర్జున్ రాంపాల్ కీలక భూమికలు పోషించారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో సాహు గారపాటి, హరీశ్ పెద్ది నిర్మించిన ఈ చిత్రం ఈనెల 19న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలకృష్ణ మాట్లాడారు. 'అనిల్ అద్భుతమైన కథతో నా దగ్గరకొచ్చాడు. ఈ కథపై ఇద్దరం ఎంతో హోమ్‌వర్క్ చేశాం. కోరుకున్నది రాబట్టుకోవడంలో అనిల్ దిట్ట. అందుకే అన్ని విభాగాల్లో సినిమా అద్భుతంగా వచ్చింది. శ్రీలీల బోర్న్ ఆర్టిస్ట్. మా ఇద్దరి కాంబినేషన్ సీన్స్ ప్రేక్షకుల్ని కట్టిపడేస్తాయి. ఈ సినిమా ప్రారంభం మాత్రమే కూల్‌గా ఉంటుంది. ఓ విస్ఫోటనం జరిగితేగానీ అద్భుతాలు జరగవు. అలాంటి అద్భుతమే 'భగవంత్‌కేసరి'. సమరసింహారెడ్డి, నరసింహనాయుడు, అఖండలా నా కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమా 'భగవంత్‌కేసరి'' అని నమ్మకం వ్యక్తం చేశారు బాలకృష్ణ. 'నవ్వించేవాడిలో భావోద్వేగాలు కూడా ఎక్కువగా ఉంటాయంటారు. మొన్నటివరకూ నవ్వించాను. ఈ సినిమా ద్వారా ఉద్వేగానికి లోనుచేస్తాను అని అనిల్ రావిపూడి అన్నారు.

పారితోషికం అందుకే పెంచిందా?

పాత్ర గొప్పదైతే కొంతవరకు పరిధులు దాటడానికి కూడా వెనుకాడనంటున్నది నేషనల్ క్రష్ రష్మిక మందన్నా. ప్రస్తుతం ఆమె సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో 'యానిమల్' సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. రణ్‌బీర్‌కపూర్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో కథానుగుణంగా కొన్ని లిప్‌లాక్‌లు కంపల్సరీ అట. ఆ విషయం తెలిసీ, పాత్ర నచ్చడంతో కాదనలేక ఓకే చెప్పేసిందట రష్మిక. అయితే, మామూలుగా సినిమాకు రెండుకోట్ల వరకూ పారితోషికాన్ని అందుకునే ఈ అందాలభామ.. ఈ సినిమాకు మత్రం ఇంకాస్త ఎక్కువే డిమాండ్ చేసినట్లు తెలిసింది. కథ డిమాండ్ మేరకు లిప్‌లాక్‌లు ఉన్నా.. అవన్నీ అర్థవంతంగా ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. ప్రస్తుతం రష్మిక చేతిలో ఉన్నవన్నీ పాన్ ఇండియా సినిమాలే కావడం విశేషం. తెలుగు, హిందీ, తమిళం ఇలా అన్నీ భాషల్లోనూ సినిమాలు చేస్తూ, మరో వైపు వ్యాపారప్రకటనల్లో నటిస్తూ బిజీబిజీగా కెరీర్ సాగిస్తున్నది రష్మిక.

టైటిల్‌కు ముహూర్తం ఫిక్స్



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా పరశురామ్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. శ్రీవెంకటేశ్వ క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు-శిరీష్ నిర్మిస్తున్నారు. మృణాల్ ఠాకూర్ కథానాయిక. 'గీత గోవిందం' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత విజయ్ దేవరకొండ-పరశురామ్ కలయికలో వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. ఈ సినిమా నుంచి తాజా అప్‌డేట్ వెలువడింది. ఈ నెల 18న ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించనున్నారు. ఈ సినిమాకు 'ఫ్యామిలీ స్టార్' అనే టైటిల్‌ను ఖరారు చేయబోతున్నారని కొద్దిరోజులుగా వార్త లొస్తున్నాయి. దాదాపు అదే టైటిల్‌ను ఖరారు చేసే ఆలోచనలో చిత్రబృందం ఉందని తెలిసింది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుగుతున్నది. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కేయూ మోహనన్, సంగీతం: గోపీసుందర్, ఆర్ట్: ఏ.ఎస్.ప్రకాష్, నిర్మాతలు: రాజు-శిరీష్, రచన-దర్శకత్వం: పరశురామ్ పెట్ల.

అపర కాళికలా

పోలీస్ క్యారెక్టర్లకు అందరు హీరోయిన్లు సెట్ కారు. విజయశాంతి వంటి కొందరు నాయికలు తప్ప. తాజాగా విడుదలైన 'సింగం ఎగైన్' చిత్రంలో దీపికా పడుకోన్ ఫస్ట్ లుక్‌ను చూస్తే పోలీస్ పాత్రకు పర్‌ఫెక్ట్‌గా సూట్ అయిందంటారు. ఆదివారం 'సింగం ఎగైన్'లోని దీపిక ఫస్ట్‌లుక్‌ని విడుదల చేయడంతోపాటు ఆమె పాత్ర పేరును కూడా మేకర్స్ రివీల్ చేశారు. ఇందులో దీపిక పాత్ర పేరు 'శక్తి శెట్టి'. నవరాత్రులు మొదలయ్యాయని విడుదల చేశారేమోగానీ, ఈ లుక్‌లో దీపికా పడుకోన్ అపర కాళికలా అనిపిస్తున్నది. శవాల కుప్పనే ఆసనంగా చేసుకొని, ఓ రౌడీ నోట్లో పిస్టల్ పెట్టి, నవ్వుతూ చంపుతున్నట్లు కనిపిస్తున్న ఆ ఫస్ట్‌లుక్‌కి విపరీతమైన అప్లాజ్ వస్తున్నది. 'సింగం ఎగైన్' కథానాయకుడు అజయ్ దేవ్‌గణ్, ఆ సినిమాలో ప్రత్యేక పాత్ర పోషిస్తున్న రణ్‌వీర్‌సింగ్ ఇద్దరూ కలిసి 'కాప్ విశ్వంలోకి స్వాగతం' అంటూ దీపిక ఫస్ట్‌లుక్ గురించి వ్యాఖ్యానించారు. హృతిక్ రోషన్ అయితే ప్రశంసల వర్షం కురిపించారు. రోహిత్ శెట్టి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఆగస్ట్15న విడుదల కానుంది.

గాంజా శంకర్ మాస్ హంగామా

సాయిధరమ్‌తేజ్

సంపత్‌నంది

సాయిధరమ్‌తేజ్ కథానాయకుడిగా సంపత్‌నంది దర్శకత్వంలో తెరకెక్కబోతున్న తాజా చిత్రానికి 'గాంజా శంకర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తున్నది. ఆదివారం సాయిధరమ్‌తేజ్ పాత్రను పరిచయం చేస్తూ అనౌన్స్‌మెంట్ టీజర్‌ను విడుదల చేశారు. దర్శకుడు సంపత్‌నంది వాయిస్ ఓవర్‌తో ఆరంభమైన ఈ వీడియో గాంజా శంకర్ ప్రపంచాన్ని పరిచయం చేస్తూ ఆద్యంతం మాస్ అంశాలతో సాగింది. తన శత్రువులపై గాంజా శంకర్ త్వరలో మాస్ దాడిని ఆరంభించబోతున్నాడంటూ దర్శకుడు పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: రిషి పంజాబీ, ప్రొడక్షన్ డిజైనర్: ఏ.ఎస్.ప్రకాష్, దర్శకత్వం: సంపత్‌నంది.

భానుప్రసాద్, శ్రీనాథ్, అభినవ్, విశ్వదేవ్

ఒక్కసారిగా కిస్మత్ మారిపోతే..

నరేష్, అగస్త్య, అభినవ్ గోమటం, విశ్వదేవ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కిస్మత్'. అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రను పోషిస్తున్నారు. శ్రీనాథ్ బాదినేని దర్శకుడు. రాజు నిర్మాత. ఆదివారం టీజర్‌ను విడుదల చేశారు. జీవితంలో ఎన్నో ఫెయిల్యూర్స్ చవిచూసిన ముగ్గురు చిన్ననాటి మిత్రులు తమ జీవితంలో ఏదైనా అద్భుతం జరగాలని కోరుకుంటారు. ఏదో ఒక లక్ష్యాన్ని పెట్టుకొని లైఫ్‌లో సెటిలైపోవాలనే నిర్ణయానికి వస్తారు. ఈ నేపథ్యంలో వారి జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది? వారి కిస్మత్ (అదృష్టం) ఎలా మారిందన్నదే చిత్ర కథాంశమని, ఇందులో థ్రిల్లింగ్ అంశాలు కూడా ఉంటాయని దర్శకుడు తెలిపారు. సరదా సంభాషణలతో సాగే యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఇదని చిత్ర హీరోలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వేదరామన్ శంకరన్, సంగీతం: మార్క్ కె రాబిన్, నిర్మాణ సంస్థలు: కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, అధీరా ప్రొడక్షన్స్, దర్శకత్వం: శ్రీనాథ్ బాదినేని.

కంటెంట్‌కు విలువ లేదు!

బాలీవుడ్ ఇండస్ట్రీలో తనలాంటి వాళ్లకు అంతగా ప్రోత్సాహం ఉండదని, కొత్తదనాన్ని అంత త్వరగా అంగీకరించరని సంచలన వ్యాఖ్యలు చేసింది అగ్ర కథానాయిక తాప్సీ. గత కొంతకాలంగా తెలుగు చిత్రసీమకు దూరంగా ఉంటున్న ఈ భామ హిందీలో లేడీ ఓరియెంటెడ్ సినిమాల్లో సత్తా చాటుతున్నది. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో బాలీవుడ్ పరిశ్రమపై విమర్శలు చేసింది తాప్సీ. సినిమాలకు కంటెంట్ మాత్రమే ముఖ్యం కాదని, ఈ విషయం తాను నిర్మాతగా మారిన తర్వాత అర్థమైందని ఈ అమ్మడు చెప్పుకొచ్చింది. 'బాలీవుడ్‌లో కథ వినగానే 'హీరో ఎవరు' అని అడుగుతారు. నేను హీరోయిన్‌గా ఎన్నో సినిమాలు చేశాను. ఏరోజూ హీరోలు, సహనటులు ఎవరని అడగలేదు. కథ నచ్చితే సినిమా ఓకే చేశాను' అని తెలిపింది. ఇంకా మాట్లాడుతూ 'ప్రస్తుతం పెద్ద సినిమాలకు మాత్రమే తగినంత ప్రచారం లభిస్తున్నది. చిన్న సినిమాల డిజిటల్ హక్కులను రిలీజ్‌కు ముందే చాలా తక్కువ ధరకు సొంతం చేసుకుంటున్నారు. ఇండస్ట్రీ బిజినెస్‌పై అది తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇక చిన్న సినిమాల గురించి పట్టించుకునే వారే లేరు. కొత్త కంటెంట్‌ను ప్రోత్సహించే విషయంలో ఎవరూ ఆసక్తి చూపించడం లేదు. నాలాంటి వారు అలా ప్రయత్నిస్తే ఎలాంటి మద్దతు లభించదు. ఇలాంటి విషయాల్లో చాలా మార్పులు రావాల్సిన అవసరం ఉంది' అని తాప్సీ పేర్కొంది.



మణిమేఖల రాజకీయం

కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ స్పై థ్రిల్లర్ చిత్రం 'డెవిల్'. 'ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్' ఉపశీర్షిక. స్వీయ దర్శకనిర్మాణంలో అభిషేక్ నామా తెరకెక్కిస్తున్నారు. సంయుక్త మీనన్ కథానాయిక. మాళవికా నాయర్ కీలక పాత్రలో కనిపించనుంది. ఆదివారం ఆమె ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో ఆమె రాజకీయ నాయకురాలు మణిమేఖల పాత్రలో కనిపించనుంది. రెట్రో లుక్‌తో ఫస్ట్‌లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నది. కథాగమనంలో మణిమేఖల పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాలో బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్ పాత్రలో హీరో కల్యాణ్‌రామ్ కనిపించబోతున్నారు. నవంబర్ 24న పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్ర ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రానికి కెమెరా: సౌందర్‌రాజన్ ఎన్, నిర్మాత, దర్శకత్వం: అభిషేక్ నామా.